


డెయిరీ ప్రొడక్ట్స్ కంపెనీ సీజ్
ఇనుపాముల శివారులో బీఎన్‌ఆర్ డెయిరీ ప్రొడక్ట్స్ పరిశ్రమను ఫుడ్ సేఫ్టీ అధికారులు సీజ్ చేశారు. - 8లో



హెచ్‌ఎం మృతి
బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టిన ఘటనలో సింగారెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మృతిచెందారు. - 8లో



డీసీఎంను ఢీకొట్టిన లారీ
విజయవాడ-హైదరాబాద్ హైవేపై వట్టిమర్తి శివారులో డీసీఎంను లారీ వచ్చి ఢీకొట్టడంతో డ్రైవర్ మృతి చెందాడు. - 8లో

న్యూస్‌రీల్

9న జాతీయ లోక్ అదాలత్

రామగిరి(నల్లగొండ) : జిల్లాలోని అన్ని కోర్టుల్లో ఈనెల 9వ తేదీన న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి బి.దీప్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీ పడదగిన సివిల్, క్రిమినల్, ప్రమాద బీమా, బ్యాంకు రికవరీ, చెక్ బౌన్స్ కేసులు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. సుమారు 3,386 కేసులను గుర్తించామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రయాస్‌పై 8న టెలీ కాన్ఫరెన్స్

నల్లగొండ : పరిశోధనలపై విద్యార్థుల్లో ఆసక్తి కలిగించేలా ప్రాజెక్టులు నమోదు చేసే విధానంపై జాతీయ విద్యా పరిశోధన మండలి, రాష్ట్ర విద్యా పరిశోధన మండలి ఆధ్వర్యంలో ఈ నెల 8న ప్రయాస్ కార్యక్రమంపై టీశాట్ నిపుణ చానెల్ ద్వారా టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు డీఈఓ భిక్షపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిశోధనా విధానంపై ప్రధాన వక్తలుగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్లు పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మిపతి 98485 78845 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

11న మండలాల్లో ధర్నాలు



సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 11న ఉమ్మడి జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలపై భారాలు మోపుతున్న ప్రభుత్వాలు ప్రజల దృష్టి మరల్చేందుకు అనేక కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా ప్రజలు సమస్యలతో సతమతం అవుతుంటే.. ఇండియా పేరును భారత్‌గా మారుస్తున్న విషయాన్ని తెరపైకి తీసుకొచ్చి ప్రజలను మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ పథకాలు సొంత పార్టీ కార్యకర్తలకు ఇస్తూ నిజమైన పేదలకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. ఈ నెల 10 నుంచి 17వరకు తెలంగాణ సాయుధ పోరాటాల వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నాయకులు పాదూరి శశిధర్‌రెడ్డి, రొండి శ్రీనివాస్, రెమడాల పరశురాములు, భిక్షం, నాగిరెడ్డి, పఠాని శ్రీను, వెంకటయ్య, ఏసుబాబు, నాగమణి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సదరం ప్రత్యేక స్లాట్ బుకింగ్

నల్లగొండ : దివ్యాంగుల సౌకర్యార్థం ప్రత్యేక సదరం స్లాట్ బుకింగ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ తెలిపారు. బుధవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ఈ నెల 16న దేవరకొండ, నాగార్జునసాగర్ నియోజకవర్గం వారికి, 23న మిర్యాలగూడ, నకిరేకల్, 25న మునుగోడు, శాలిగౌరారం మండలం వారికి, 29న నల్లగొండ నియోజకవర్గం వారికి స్లాట్ బుక్కింగ్‌కు అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. ప్రతి క్యాంపునకు 100 మందికి షెడ్యూల్ విడుదల చేశామని తెలిపారు. దివ్యాంగులు సమీపంలోని మీసేవ కేంద్రంలో నిర్ణీత రుసుం చెల్లించి ముందుస్తు స్లాట్ పొంది, మీసేవ రోడులో తెలిపిన తేదీన జిల్లా ఆసుపత్రిలోని సదరం కార్యాలయంతో నిర్వహించే వైకల్య వైద్య నిర్ధారణ పరీక్షలకు హాజరు కావాలని సూచించారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల నిరసన



నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

నల్లగొండ రూరల్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీలో కాంట్రాక్ట్ అధ్యాపకుల నిరసన బుధవారం కొనసాగింది. డిగ్రీ, జూనియర్ కళాశాలల అధ్యాపకుల మాదిరిగానే తమను కూడా రెగ్యులరైజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు పాండరయ్య, రామచంద్రు, అశ్విని, రాజేశ్వరి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.576 కోట్లు మాఫీ

- 95,862 మంది రైతులకు లబ్ధి
- మరో 21,323 మంది వివరాలు ట్రెజరీకి..
- రుణమాఫీతో హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



నల్లగొండ అగ్రికల్చర్ : రైతుల రుణమాఫీ డబ్బులను ఖాతాల్లో జమ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 133 బ్యాంకుల బ్రాంచీల్లో 95,862 మంది రైతులకు సంబంధించిన రూ.576 కోట్ల 8లక్షల 80వేల మొత్తాన్ని మాఫీ చేసింది. మరో 21,323 మంది రైతులకు సంబంధించిన రుణాలు రూ.114 కోట్లు మాఫీ కోసం ట్రెజరీకి పంపించింది. ప్రతి రోజూ దశల వారీగా రుణమాఫీ చేస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

2018 డిసెంబర్ 11లోపు తీసుకున్న రుణాలే..

ఎన్నికల హామీలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందన్న ధీమాతో చాలా మంది రైతులు బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలను తిరిగి చెల్లించలేదు. కనీసం రుణాలను రెన్యువల్ కూడా చేసుకోకపోవడంతో అసలు, వడ్డీ కలిపి రెండింతలైంది. రాష్ట్ర ప్రభుత్వం 2018 డిసెంబర్ 11లోపు తీసుకున్న రుణాలను మాత్రమే మాఫీ చేస్తున్నట్లు ప్రకటించి అప్పుడు రైతు రుణం ఎంత ఉందో లెక్కలు తెప్పించుకుంది. ప్రస్తుతం అమలు చేస్తున్న రుణమాఫీ అప్పుడు తీసుకున్న లెక్కల ప్రకారమే చేస్తున్నారు. రూ.25 వేలలోపు రుణాలను రెండేళ్ల క్రితం మాఫీ చేసింది. ప్రస్తుతం రూ.లక్షలోపు రుణాలన్నింటి మాఫీ చేస్తోంది. ఆగస్టు నెల ప్రారంభం నుంచి రుణమాఫీ ప్రక్రియను ప్రారంభించిన ప్రభుత్వం దశల వారీగా బ్యాంకుల్లో రుణాలను జమ చేస్తోంది.

నియోజకవర్గాల వారీగా ఇలా..

మిర్యాలగూడ నియోజకవర్గంలో 14 బ్రాంచీల్లో 9,444 మంది రైతులకు సంబంధించి రూ.54 కోట్ల 4లక్షల 56 వేలు, నాగార్జునసాగర్ నియోజకవర్గంలో 31 బ్రాంచీల్లో 19,655 మంది రైతులకు రూ.90 కోట్ల 34లక్షల 52 వేలు, దేవరకొండలో 25 బ్రాంచీల్లో 19,282 మంది రైతులకు రూ.138 కోట్ల 37 లక్షల 16 వేలు, మునుగోడులో 15 బ్రాంచీల్లో 13,338 మంది రైతులకు రూ.57 కోట్ల 7లక్షల 27 వేలు, నకిరేకల్‌లో 21 బ్రాంచీల్లో 14,165 మంది రైతులకు రూ.132 కోట్ల 9లక్షల 60 వేలు, నల్లగొండ నియోజకవర్గంలోని 23 బ్రాంచీల్లో 11,943 మంది రైతులకు రూ.58 కోట్ల 38లక్షల 3 వేలు, తుంగతుర్తి నియోజకవర్గంలోని శాలిగౌరారం మండంలోని 4 బ్రాంచీల్లో 3840 మంది రైతులకు రూ.21 కోట్ల 58 లక్షల 44 వేలు, అదేవిధంగా నల్లగొండ జిల్లా సమీపంలోని ఇతర జిల్లాల నుంచి రుణాలను తీసుకున్న రైతులు 4,195 మంది రైతులకు రూ.24 కోట్ల 19లక్షల 22 వేలు ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం పంట రుణాలను మాఫీ చేసి ఖాతాల్లో జమచేసింది. ఈ రుణమాఫీ ప్రక్రియను ఈ నెల 15వ తేదీ వరకు కొనసాగుతుందని, రూ.లక్షకుపైన ఉన్న పంటరుణాలను కూడా మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో రూ.లక్షకు పైగా రుణాలు ఉన్న రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దశల వారీగా రైతుల ఖాతాల్లో జమ



రూ.లక్షలోపు రుణమాఫీ డబ్బులను దశల వారీగా రైతుల అప్పు ఖాతాల్లో ప్రభుత్వం జమచేస్తుంది. ప్రతి రోజు కొందరి చొప్పున వేస్తోంది. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. 2018 డిసెంబర్ 11 వరకు ఉన్న రుణాలను ప్రభుత్వం మాఫీ చేస్తుంది. మాఫీ అయిన వెంటనే తిరిగి పంట రుణాలను ఇవ్వాలని బ్యాంకులను ప్రభుత్వం ఆదేశించింది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రవణ్‌కుమార్, డీఏఓ

ఐదు గేట్ల ద్వారా మూసీ నీటి విడుదల



మూసీ ప్రాజెక్టు నుంచి దిగువకు పోతున్న వరదనీరు

కేతేపల్లి : నాగార్జునసాగర్ తర్వాత అతిపెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టుకు బుధవారం ఇన్‌ఫ్లో పెరిగింది. దీంతో అధికారులు ప్రాజెక్టు ఐదు క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. హైదరాబాద్‌తోపాటు మూసీ పరిసరాల్లో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్టుకు ఎగువ నుంచి 10,145 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు మంగళవారం ఐదు క్రస్ట్ గేట్లను రెండు అడుగులు పైకెత్తి ఉంచి 9,729 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా ఆయకట్టుకు 336 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మూసీ రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.12 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

ఎన్నికలకు అధికారులు సిద్ధంగా ఉండాలి

- కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్, చిత్రంలో ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ : సాధారణ ఎన్నికల ప్రక్రియ సమీపిస్తున్నందున ఎన్నికల బాధ్యతలు నిర్వహిస్తున్న నోడల్ అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణకు సన్నద్ధతపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఎటువంటి తప్పిదాలకు తావివ్వకుండా సమర్థంగా పని చేయాలన్నారు. సార్వత్రిక ఎన్నికలకు జిల్లాలో 1766 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని.. వాటిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 520 ఉన్నాయని గుర్తించామన్నారు. గతంలో రీపోలింగ్ జరిగిన ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నియోజకవర్గ కేంద్రాల్లో ఈవీఎంలు ఎక్కడ భద్రపరచాలి, డిస్ట్రిబ్యూషన్, పార్కింగ్, ట్రాఫిక్ వంటి విషయాలపై ఆర్‌ఓలు సంబంధిత అధికారులు, పోలీస్ సిబ్బందితో సమావేశాలు నిర్వహించి సమగ్ర వివరాలు అందజేయాలని కోరారు. మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్, వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ అపూర్వరావు మాట్లాడుతూ ఇప్పటికే అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా నిరంతర నిఘా కొనసాగిస్తామన్నారు. సరిహద్దులలో చెక్‌పోస్టుల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు హేమంత్ కేశవ్ పాటిల్, జె.శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కర్ణన్

నల్లగొండ : దివ్యాంగుల చట్టం –2016ను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన దివ్యాంగుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు పోలీస్ శాఖల సమన్వయంతో పనిచేయాలన్నారు. సదరం సర్టిఫికెట్ల జారీలో ఇబ్బందుల పరిష్కారం కోసం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వ పథకాల్లో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఉపాధి హామీ, సమభావన సంఘాల్లో దివ్యాంగులకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. సమావేశంలో సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారిని కృష్ణవేణి, డీఆర్‌డీఓ కాళిందిని, మెప్మా పీడీ కరుణాకర్, రఫీ, డాక్టర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్నేశ్వరమ్మ గుట్టపై గుడిసెలు వేసేందుకు యత్నం

- కర్రలు పాతి చుట్టూ చీరలు కట్టిన పేదలు
- అడ్డుకుని స్టేషన్‌కు తరలించిన పోలీసులు



అన్నేశ్వరమ్మ గుట్ట వద్ద మహిళలను అడ్డుకుంటున్న పోలీసులు

నల్లగొండ రూరల్ : నల్లగొండ పట్టణ పరిధిలోని అర్జాలబావి సమీపంలో ఉన్న అన్నేశ్వరమ్మ గుట్టపై గుడిసెలు వేసేందుకు కొందరు పేదలు యత్నించారు. సుమారు 500 మంది మహిళలు గుట్ట చుట్టూ చేరి తమకు నచ్చిన ప్రాంతంలో ప్లాట్లను ఏర్పాటు చేసుకునేందుకు కర్రలు పాతి చీరలు కట్టి ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు వారికి అక్కడి నుంచి పంపించేందుకు ప్రయత్నించగా మహిళలు అక్కడే కూర్చున్నారు. దీంతో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గుట్టపై ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చేసేదేమీ లేక పోలీసులు మహిళలను వాహనంలో ఎక్కించి నల్లగొండ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తర్వాత వ్యక్తిగత పూచికత్తుపై వదిలిపెట్టారు.



గుట్టపై కర్రలు పాతి కట్టిన చీరలు



మహిళను తీసుకెళ్తున్న పోలీసులు



మహిళను డీసీఎంలోకి ఎక్కిస్తున్న పోలీసులు

సమగ్రశిక్ష ఉద్యోగుల రిలే దీక్షలు



బోనాలతో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగులు

నల్లగొండ : రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే దీక్షలు బుధవారం 3వ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ఉద్యోగులు బోనాలు ఎత్తి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న 25 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, మినిమం స్కేల్ వెంటనే అమలు చేయాలని కోరారు. ఇతర రాష్ట్రాల్లో సమగ్ర శిక్ష ప్రాజెక్టుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇస్తున్నారని తెలంగాణలో కూడా ఇవ్వాలని కోరారు. దీక్షలకు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సైదులు, బీఆర్‌ఎస్ నాయకుడు పిల్లి రామరాజుయాదవ్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె వెంకటరెడ్డి, తిరందాసు సంతోష్‌కుమార్, యాట వెంకట్, కామన బోయిన కేశవులు, పగిడిపాటి ప్రవీణ్, కునుకుంట్ల కొండయ్య, అంబర్ల సత్యనారాయణ, బంటు వెంకన్న, లక్ష్మి, క్రిష్ణా, జాని, సైదులు, నాగరాజు, శ్రీను, లింగయ్య, యాదమ్మ, మానస, రాధిక, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెళ్లిపోతివా బిడ్డా..



ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థిని శివాని స్వగ్రామం నార్కట్‌పల్లి మండలం నక్కలపల్లిలో ఆమె మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, పరామర్శకు వచ్చిన జెడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి

సాగర్ ఆయకట్టులో ఆరుతడి మేలు

- ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకుడు డాక్టర్ పి.రఘురామిరెడ్డి సూచనలు



హాలియా వద్ద బీడుగా ఉన్న భూమి

నల్లగొండ : కృష్ణా పరివాహక ప్రాంతంలో ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. దీంతో నాగార్జునసాగర్ ఎడమకాల్వ ఆయకట్టుకు నీటిని విడుదల చేయలేదు. ఏటా వరి సాగు చేసే భూముల్లో రైతాంగం ఇప్పటి వరకు ఏ పంటలూ విత్తుకోలేదు. ఈ నేపథ్యంలో సాగర్ ఆయకట్టు పరిధిలో సాగు చేయదగ్గ పంటల గురించి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకుడు డాక్టర్ పి.రఘురామిరెడ్డి పలు సూచనలు చేశారు.

నీటి వసతి, నేలరకం ఆధారంగా..

- వర్షాలపై ఆధారపడిన వారు తమ భూముల్లో ఉలవలు, బొబ్బెరలు (అలసందలు), నీటి వసతి ఉన్నవారు పెసర, మినుము, కంది, వేరుశనగ, పొద్దు తిరుగుడు, మొక్కజొన్న, జొన్న, ఆముదం పంటలు సాగు చేసుకోవచ్చు.
- వరి సాగుచేసే భూముల్లో మొక్కజొన్న, కంది, పొద్దు తిరుగుడు, ఆముదం ఇతర పంటలు సాగు చేసినప్పుడు అధిక వర్షాలు కురిసినప్పుడు భూముల్లో నీరు నిలుస్తుంది. దీని వల్ల మొక్కలు వేరు కుళ్లు తెగులు సోకి నష్టపోకుండా బోదెలు, సాళ్ల పద్ధతిలో విత్తుకోవడం శ్రేయస్కరం

పంటల్లో యాజమాన్య పద్ధతులు

- మొక్కజొన్నకు 6 నుంచి 8 తడులు ఇవ్వాలి. మొదటి నెల రోజుల వరకు నీరు నిల్వ ఉండకూడదు. జల్లు, పూత, గింజ పాలు పోసుకునే దశలో తప్పనిసరిగా నీటి తడులు ఇవ్వాలి.
- జొన్న పంటకు 4 నుంచి 6 తడులు ఇవ్వాలి. పంట విత్తిన నెల రోజుల వరకు మొవ్వ తొలుచు ఈగ నుంచి పంటను కాపాడుకోవాలి.
- కంది పంటకు 5 నుంచి 7 తడులు ఇవ్వాలి. ఎండు తెగులు తట్టుకునే మధ్యకాలిక రకాలను సాగు చేసుకోవాలి. దుక్కిలో ఎకరానికి ఒక బస్తా డీఏపీ తప్పనిసరిగా వేసుకోవాలి. మొగ్గ రాలేయే ముందు, కాయలు ఏర్పడే దశలో తప్పకుండా నీటి తడి ఇవ్వాలి. మొగ్గ దశ, కాయలు ఏర్పడే దశల్లో నీరు ఎక్కువైనా లేదా బెట్టకు గురైనా పూత కాత రాలిపోతుంది.
- పెసర, మినుము పంటకు 4 నుంచి 6 తడులు ఇవ్వాలి. పూత, కాయ తయారయ్యే దశలో పంట బెట్టకు గురికాకుండా చూడాలి.
- వేరుశనగ పంటకు 6 నుంచి 7 తడులు ఇవ్వాలి. రెండవ తడిని విత్తిన తర్వాత మొలక వచ్చిన 20 నుంచి 25 రోజులకు (పూర్తిగా ఒకేసారి పూత వచ్చేందుకు) ఇవ్వాలి. పైరులో ఊడలు దిగే దశ నుంచి కాయలు ఊరే వరకు (విత్తిన 45 – 50 రోజులు నుంచి 85 – 90 రోజుల వరకు) సక్రమంగా తగు మోతాదులో నీరు కట్టాలి.
- పొద్దు తిరుగుడు పంటకు 4 నుంచి 6 తడులు ఇవ్వాలి. నేల రకాన్ని బట్టి పగటి ఉష్ణోగ్రతను బట్టి ఎర్ర నేలల్లో 8 నుంచి 10 రోజుల వ్యవధిలో, నల్లరేగడి నేలల్లో 15 నుంచి 20 రోజుల వ్యవధిలో నీటి తడులు పెట్టాలి. మొగ్గ తొడుగు దశ, పువ్వు వికసించు దశ, గింజ కట్టే సమయం దీనిలో కీలక దశలు. పైరు పూత దశలో ఆకర్షక పత్రాలు వికసించే దశలో రెండు గ్రాముల బోరాక్స్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- ఆముదం పంటకు 8నుంచి 10 తడులు ఇవ్వాలి. అక్టోబర్, డిసెంబర్ వరకు తక్కువ ఉష్ణోగ్రత వల్ల 12 నుంచి 15 రోజులకు ఒకసారి నీటి తడి ఇవ్వాలి. జనవరి నెల నుంచి ఎనిమిది నుంచి పది రోజుల వ్యవధిలో నీరు ఇవ్వాలి. పూత, కాయ ఊరే దశల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలి.

క్లుప్తంగా

వీఎస్ఆర్ డెయిరీ ప్రొడక్ట్స్ కంపెనీ సీజ్



అధికారులు సీజ్ చేసిన కంపెనీ ఇదే..

కేతేపల్లి: మండలంలోని ఇనుపాముల శివారులో లైసెన్స్ లేకుండా పాల ఉత్పత్తులు తయారు చేసి విక్రయిస్తున్న వీఎస్ఆర్ డెయిరీ ప్రొడక్ట్స్ పరిశ్రమను బుధవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు సీజ్ చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇనుపాముల శివారులో ఆరు నెలల క్రితం ఏర్పాటు చేసిన వీఎస్ఆర్ డెయిరీ ప్రొడక్ట్స్ కంపెనీని ఫుడ్ సేఫ్టీ రాష్ట్ర కమిషనర్, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఉమ్మడి నల్లగొండ జిల్లా ఫుడ్ సేఫ్టీ అసిస్టెంట్ కమిషనర్ జ్యోతిర్మయి ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీసు అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కొమరబండ వద్ద గతంలో నిర్వహించిన డెయిరీ పరిశ్రమ పేరిట పొందిన లైసెన్స్‌తోనే ఈ కంపెనీ నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అంతేకాకుండా పాల ఉత్పత్తులు తయారు చేసే పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో కంపెనీ యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తుండటంతో కంపెనీలో నిల్వ ఉన్న రూ.6లక్షల విలువైన 2000 పాల ప్యాకెట్లు, ప్రోటీన్ బైండర్స్‌ను సీజ్ చేశారు. పాలు, పెరుగు ఉత్పత్తుల నమూనాలను సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించనున్నట్లు అధికారులు తెలిపారు. డెయిరీ ఉత్పత్తుల్లో కల్తీ జరిగినట్లు నివేదిక వస్తే కంపెనీని పూర్తిగా సీజ్ చేస్తామని అధికారులు పేర్కొన్నారు. పదిహేను రోజుల్లో అన్నిరకాల అనుమతులు పొందాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఈ తనిఖీలలో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారిణి స్వాతి, కేతేపల్లి తహసీల్దార్ ఎస్. మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

నార్కట్‌పల్లి: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నార్కట్‌పల్లి పట్టణంలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. కట్టంగూరు మండలం దుగినెల్లికి చెందిన ఉట్కూరు అంజయ్య కుటుంబంతో కలిసి నార్కట్‌పల్లిలోని బీసీ హాస్టల్ సమీపంలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అంజయ్యకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడు నరేష్(25) బోరు బండి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం అంజయ్య, కుటుంబ సభ్యులు కుమార్తె ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో నరేష్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో సోదరుడు సురేష్ ఇంటికి వచ్చి చూసేసరికి ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా.. ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదబాబా తెలిపారు.

అలరించిన గోపిక, కృష్ణులు

'సాక్షి' ఆహ్వానానికి విశేష స్పందన వచ్చింది. కృష్ణాష్టమి సందర్భంగా చిన్నారులను కృష్ణులుగా, గోపికలుగా అలంకరించి ఫొటోలను పంపించాలని కోరగా.. ఆ మేరకు తల్లిదండ్రులు తమ బుజ్జాయిలను అందంగా ముస్తాబు చేసి ఫొటోలను వాట్సప్ చేశారు. చిన్నారులు అందమైన వేషధారణతో ఆకట్టుకున్నారు.



హైవేపై ఆగి ఉన్న డీసీఎంను ఢీకొట్టిన లారీ

- లారీ డ్రైవర్ దుర్మరణం

చిట్యాల: మండలంలోని వట్టిమర్తి గ్రామ శివారులో బుధవారం తెల్లవారుజామున విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆగి ఉన్న డీసీఎంను వెనుక నుంచి లారీ వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతిచెందాడు. చిట్యాల ఎస్‌ఐ ఐరుగు రవి తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం(టీఎస్ 05 యూఏ 3446)ను చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామ శివారులోకి రాగానే విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై డ్రైవర్ నిలిపాడు. అదే దారిలో హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ(ఎంహెచ్ 13 సీయూ1839) ఆగి ఉన్న డీసీఎంను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన లారీ డ్రైవర్ హాజీమలాంగ్ నబిలాల్(43) అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ మృతదేహాన్ని స్థానికుల సహాయంతో బయటకు తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. హెచ్‌ఎం మృతి

సూర్యాపేట క్రైం: బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టిన ఘటనలో ప్రధానోపాధ్యాయురాలు మృతిచెందింది. ఈ ఘటన బుధవారం సూర్యాపేట పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలు.. సూర్యాపేటలోని అమ్మ గార్డెన్స్ సమీపంలో జలగం కవిత(41), లింగయ్య దంపతులు నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కవిత పెన్‌పహాడ్ మండలం సింగారెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తుండగా.. లింగయ్య అదే మండలంలోని అనాజిపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం భార్యాభర్తలిద్దరూ బైక్‌పై పాఠశాలలకు వెళ్తుండగా సూర్యాపేట పట్టణంలోని కొత్త వ్యవసాయ మార్కెట్ సమీపంలో హైవేపై బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కవిత అక్కడికక్కడే మృతిచెందగా, లింగయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు సూర్యాపేట జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. కవిత మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు.

విద్యార్థినుల మృతితో రెండు గ్రామాల్లో విషాదం

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలంలోని నక్కలపల్లికి చెందిన దొంతరబోయిన శివాని(18), అమ్మనబోలుకు చెందిన అనుగూతల మనీషా(18) నల్లగొండలో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆ రెండు గ్రామాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. శివాని, మనీషా ఇద్దరూ నార్కట్‌పల్లిలో ఇంటర్(బైపీసీ) ఒకే కళాశాలలో చదివారు. అప్పుడే వారి మధ్య స్నేహం ఏర్పడింది. ఇంటర్ పూర్తయిన అనంతరం నల్లగొండలోని ప్రభుత్వ ఉమెన్స్ కాలేజీలో బీఎస్సీలో చేరారు. నల్లగొండలోనే ఎస్సీ ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. నక్కలపల్లి గ్రామానికి చెందిన దొంతరబోయిన సైదులుకు ఒక కూతురు శివాని, ఒక కుమారుడు ఉన్నారు. తండ్రి గ్రామంలో వ్యవసాయకూలి పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. శివాని గ్రామంలోని హైస్కూల్‌లో 10వ తరగతి వరకు చదివి ఇంటర్ నార్కట్‌పల్లిలో చదివింది. ఇదే మండలంలోని అమ్మనబోలు గ్రామానికి చెందిన ఎనుగుత్తల మల్లయ్యకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు కాగా.. మనీష రెండో కూతురు. ఆమె 10వ తరగతి వరకు గ్రామంలోని హైస్కూల్‌లో, ఇంటర్ నార్కట్‌పల్లిలో చదివింది. తండ్రి రోజువారి కూలి చేస్తూ జీవనం సాగిస్తున్నారు. 'నా బిడ్డను ఎవరో బెదిరించి సెల్ ఫోన్‌లో ఫొటోలు పెట్టారంట, అందుకే నా బిడ్డ గడ్డిమందు తాగి చనిపోయింది. నా బిడ్డను బెదిరించిన వాళ్లను పట్టుకోవాలి' అని శివాని తల్లి రేణుక వేడుకుంది. 'మా కూతురు కాలేజీకి పోతున్నా అని పొద్దున్నే వెళ్లిపోయింది. నల్లగొండలో గడ్డిమందు తాగి చనిపోయింది. ఫోన్ చేసి నాకు ఏమో అవుతుందని చెప్పింది. అంతే తప్ప ఏమైందో తెలియదు' అని మనీష తల్లిదండ్రులు మల్లయ్య, యాదమ్మ చెప్పారు.



నక్కలపల్లిలో మనీషా మృతదేహానికి నివాళి అర్పిస్తున్న, జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



నల్లగొండలోని రాజీవ్‌పార్కులో మంగళవారం గడ్డిమందు తాగి పడిపోయిన మనీషా, శివాని

గ్రామాలకు చేరిన మృతదేహాలు

శివాని, మనీషా మృతదేహాలకు బుధవారం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన తరువాత మధ్యాహ్నం వారి గ్రామాలకు తరలించారు. మృతదేహాలను చూడగానే కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. గ్రామస్తులు కూడా కన్నీటిపర్యంతమయ్యారు. నక్కలపల్లిలో జరిగిన శివాని అంతిమ యాత్రలో ప్రజలంతా పాల్గొన్నారు. సాయంత్రం 6 గంటలకు అంత్యక్రియలు ముగిశాయి. కాగా, మనీషా బాబాయ్ ముంబాయిలో ఉంటున్నందున ఆయన రాగానే మనీషా అంత్యక్రియలు అమ్మనబోలులో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే పరామర్శ

మృతుల కుటుంబ సభ్యులను ఆయా గ్రామాల్లో జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి పరామర్శించారు. మృతదేహాలపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. వీరి వెంట ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు ఈద మాదవి నర్సింహ్మా, బద్దం వరలక్ష్మి రాంరెడ్డి, ఎంపీటీసీలు కొంపెల్లి సైదులు, అంజయ్య, బాషపాక రవికుమార్ తదితరులు ఉన్నారు.



నార్కట్‌పల్లి: అమ్మనబోలులో మనీషా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యువకులు